బస్టాండ్ సమస్య తీరేదెన్నడు?

- పెనుగొండ కళాశాల కూడలి వద్ద విద్యార్థుల వెతలు
- వాసవీమాత దర్శనానికి వచ్చే భక్తులకు ప్రధాన సమస్యగా మారిన వైనం

పెనుగొండ: నిలవడానికి నిలువ నీడ లేక పెనుగొండ కళాశాల కూడలి వద్ద ఇటు యాత్రీకులు.. అటు విద్యార్థులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన పెనుగొండలో కళాశాల కూడలి వద్ద బస్టాండ్ నిర్మాణం కలగానే మిగిలిపోతుంది. ఎస్వీకేపీ అండ్ డాక్టర్ కేఎస్ రాజు విద్యా సంస్థల్లో వేలాది మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తున్నారు. ఈ కళాశాలకు తూర్పు గోదావరి జిల్లా రావులపాలెం, గోపాలపురం, పెరవలి మండలాల్లోని పరిసర ప్రాంతాల నుంచి, ఇటు పెనుమంట్ర, ఆచంట, పాలకొల్లు, పోడూరు మండలాల నుంచి నిత్యం వందలాది మంది విద్యార్థులు కళాశాలకు బస్సుల్లో ఉదయం రావడం, సాయంత్రం తిరిగి వెళ్తుంటారు. ఉదయం వేళ నేరుగా బస్సు దిగిదిగగానే కళాశాలకు వెళ్లిపోతారు. సాయంత్రం వేళ కళాశాల ముగియగానే బస్సుల కోసం గంటల తరబడి వేచి చూస్తుంటారు. వీరికి నిలవడానికి కళాశాల యాజమాన్యం చిన్న షెడ్ నిర్మించినా ఇక్కడ పట్టుమని పదిమంది కూడా నిలవలేని పరిస్థితి. దీంతో విద్యార్థులు ఎండకు ఎండుతూ వానకు తడుస్తూ నానా ఇబ్బందులు పడుతున్నారు.


పెనుగొండ కళాశాల కూడలి వద్ద బస్సుల కోసం విద్యార్థుల పాట్లు


నిత్యం వందలాది మంది వచ్చే పెనుగొండ వాసవీ శాంతి ధాం

యాత్రీకులదీ అదే దుస్థితి

వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవారి జన్మస్థలం పెనుగొండ. దీంతో అఖిల భారత శ్రీవాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో కోట్లాది రూపాయల వ్యయంతో వాసవీ శాంతిధాం నిర్మించారు. దీనికి తోడు మూలవిరాట్ వాసవీ కన్యకపరమేశ్వరి కొలువై ఉన్న శ్రీనగరేశ్వర మహిషాసుర మర్దనీ వాసవీ కన్యకపరమేశ్వరి అమ్మవారి ఆలయాన్ని కొయంబత్తూరు భక్తులు తీర్చిదిద్దారు. దీంతో ఆయా ప్రాంతాలను దర్శించుకోవడానికి తమిళనాడు, కర్ణాటక, కేరళ, తెలంగాణా రాష్ట్రాల నుంచి నిత్యం వందలాది మంది భక్తులు వస్తున్నారు. వీరు పాలకొల్లు, తణుకు వరకూ రైళ్లలో వచ్చి, అనంతరం బస్సుల్లో చేరుకుంటున్నారు. తిరిగి వెళ్లేటపుడు కనీస వసతులు ఉన్న బస్టాండు లేకపోవడంతో వారు పడుతున్న వెతలు వర్ణనాతీతం. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి బస్టాండు నిర్మాణం చేపట్టి కనీస వసతులు కల్పించాలని కోరుతున్నారు.

బస్టాండ్ కలగానే మిగిలిపోతుంది



పెనుగొండ కళాశాల కూడలి వద్ద బస్టాండు నిర్మాణం కలగానే మిగిలిపోతుంది. ఎన్నో ఏళ్లుగా బస్టాండు కోసం వినతులు చేస్తున్నా పట్టించుకోవడం లేదు. గతంలో కళాశాల నిర్మించి బస్టాండును రోడ్డు విస్తరణలో తొలగించారు. విస్తరణ పూర్తయినా బస్టాండు నిర్మించలేదు. అధికారులు స్పందించి బస్టాండు నిర్మాణం చేపట్టాలి.

– నల్లిమిల్లి వేణు ప్రతాపరెడ్డి(బాబీ రెడ్డి), పెనుగొండ

విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు



వందలాది మంది విద్యార్థులు దూర ప్రాంతాల నుంచి కళాశాలకు వస్తుంటారు. వీరంతా ఎండలోనూ, వానలోనూ ఇబ్బందులు పడుతున్నారు. కనీసం నిలవడానికి నీడ కూడా లేదు. దీంతో బాధలు వర్ణనాతీతం. బస్టాండు నిర్మాణం చేపట్టి, విద్యార్థుల సమస్యను పరిష్కరించాలి.

– బి.ఆనంద్‌కుమార్, విద్యార్థి, పెనుగొండ

స్వర్ణాంధ్రలో పాలిసెట్ హెల్ప్ లైన్ సెంటర్

నరసాపురం రూరల్: స్వర్ణాంధ్రా పాలిటెక్నిక్ కళాశాలలో పాలిసెట్ కౌన్సెలింగ్ హెల్ప్‌లైన సెంటర్‌ను ఏర్పాటు చేస్తూ ఆంధ్రప్రదేశ్ సాంకేతిక విద్యామండలి ఉత్తర్వులను జారీచేసినట్లు కళాశాల చైర్మన్ కొండవీటి సత్యనారాయణ, కోశాధికారి కొండవీటి వెంకటేశ్వర స్వామి, డైరెక్టర్ అడ్డాల శ్రీహరి, పాలిటెక్నిక్ ప్రిన్సిపల్ కిరణ్మయి తదితరులు విలేకరుల సమావేశంలో తెలియజేశారు. పాలిసెట్ 2025లో ర్యాంకులు సాధించిన విద్యార్థులందరికీ ఈ నెల 21 నుంచి 28 వరకు రోజుకు 15000 ర్యాంకుల వరకూ సర్టిఫికేట్ వెరిఫికేషన్ అవుతుందని తెలిపారు. ప్రతిరోజూ ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు వెరిఫికేషన్ ర్యాంకు ప్రకారం నిర్వహిస్తారని తెలియజేశారు. ఆప్షన్స్ కేటాయింపు 25 నుంచి 30 వరకు ఉంటుందని వివరించారు. జూలై 7న అలాట్మెంట్ లిస్టు వస్తుందని తెలిపారు. నరసాపురం పరిసర ప్రాంత విద్యార్థులు దూర ప్రయాణం చేయాల్సిన అవసరం లేకుండా సాంకేతిక విద్యామండలి తమ కళాశాలలో ఈ అవకాశం కల్పించారన్నారు. ఈ సదుపాయాన్ని పాలిసెట్లో అర్హత సాధించిన నరసాపురం పరిసర గ్రామాల విద్యార్థులందరూ వినియోగించుకోవాలని కోరారు.

పేకాడుతున్న ఐదుగురి అరెస్టు

నరసాపురం రూరల్: మండలంలోని యర్రంశెట్టివారిపాలెంలో శనివారం పేకాట స్థావరంపై దాడి చేసి ఐదుగురు వ్యక్తులను అరెస్టు చేసినట్లు రూరల్ ఎస్సై టి వెంకట సురేష్ తెలిపారు. పేకాడుతున్నట్లు తమకు వచ్చిన సమాచారం మేరకు దాడి చేశామని పేర్కొన్నారు. నిందితుల నుంచి రూ 3,900 నగదును స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని వివరించారు.

క్లుప్తంగా

వైభవంగా లక్ష్మీగణపతి హోమం


లక్ష్మీగణపతి హోమంలో పాల్గొన్న భక్తులు

పాలకొల్లు సెంట్రల్: స్థానిక శ్రీ క్షీరారామలింగేశ్వరస్వామి ఆలయంలో సంకట హర చతుర్థి సందర్భంగా లక్ష్మీ గణపతి హోమం నిర్వహించారు. శనివారం ఉదయం ఆలయ అభిషేక పండిట్ భమిడిపాటి వెంకన్న బ్రహ్మత్వంలో 15 మంది భక్తులు హోమంలో పాల్గొన్నారు. హోమం అనంతరం భక్తులకు స్వామివారి శేష వస్త్రం, ప్రసాదం అందజేశారు. ఆలయ ఈఓ ముచ్చర్ల శ్రీనివాస్, సూపరింటెండెంట్ పి వాసు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వాసవీ హోమం


పెనుగొండ వాసవీ శాంతిధాంలో వాసవీ హోమం నిర్వహిస్తున్న కర్ణాటక భక్తులు

పెనుగొండ: అఖిల భారత శ్రీ వాసవీ పెనుగొండ టెంపుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలోని వాసవీ శాంతి ధాంలో శనివారం వాసవీ హోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. కర్ణాటక నుంచి భక్తులు ఉదయం నుంచి రుషీ గోత్ర మందిరంలో గో పూజలు నిర్వహించిన అనంతరం, 90 అడుగుల వాసవీ కన్యకపరమేశ్వరి పంచ లోహ విగ్రహాన్ని దర్శించుకున్నారు. అనంతరం మరకత శిల వాసవీ మాతకు అభిషేకాలు, అర్చనలు చేశారు.ఆలయ అర్చకుడు శిష్టా మణికంఠ ఆధ్వర్యంలో వాసవీ హోమం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

మందాలమ్మకు వెండి సమర్పణ


వడలి గ్రామ దేవత మందాలమ్మకు వెండి సమర్పిస్తున్న దాతలు

పెనుగొండ: వడలి గ్రామ దేవత మందాలమ్మ వెండి వస్తువుల తయారీకి దాతలు వెండిని సమర్పించినట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శనివారం కాటకోటేశ్వరం గ్రామానికి చెందిన కారింకి నాగరాజు, మంగతాయారు దంపతులు వెండి బిస్కట్‌ను అందించారని తెలిపారు. ఆలయాభివృద్ధికి సహకరిస్తున్న దాతలకు కమిటీ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు.

ఆర్టీసీ ఉద్యోగి రవికుమార్ మృతి తీరని లోటు


రావి రవికుమార్ (ఫైల్)

నరసాపురం రూరల్: ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా కోశాధికారి, ఎఐఎస్ఎఫ్ జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి రావి రవికుమార్ మృతి తీరని లోటు అని సీపీఐ జిల్లా కార్యదర్శి కోనాల భీమారావు, సీపీఐ రాష్ట్ర సమితి సభ్యులు నెక్కంటి సుబ్బారావు అన్నారు. శనివారం చిట్టవరంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.సీతారాంప్రసాద్‌తో కలిసి వీరు రవికుమార్ భౌతికకాయానికి పూలమాల వేసినివాళులర్పించారు. ఈ సందర్భంగా భీమారావు మాట్లాడుతూ రవికుమార్ సేవలను కొనియాడారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు నెక్కంటి క్రాంతికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలే మనిషికి జీవనాధారం


రైతు సేవా కేంద్రం వద్ద మొక్కలను నాటుతున్న బీజేపీ నాయకులు

యలమంచిలి: మొక్కలే మనిషికి జీవనాధారమని బీజేపీ మండల అధ్యక్షులు తోలేటి లక్ష్మీనారాయణ (చంటి) అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా శనివారం మేడపాడు రైతు సేవా కేంద్రం వద్ద ఆయన ఆధ్వర్యంలో నాయకులు మొక్కలు నాటారు. అనంతరం రైతు సేవా కేంద్రంలో వికసిత భారతదేశపు అమృతకాలం-సేవ, సుపరిపాలన, పేదల సంక్షేమానికి 11 సంవత్సరాలు కార్యక్రమం నిర్వహించారు. మోదీ 11 ఏళ్ల పాలనలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ పథకాల ఫోటో ఎగ్జిబిషన్ ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో వికసిత భారత కో కన్వీనర్ జక్కంపూడి కుమార్, పాలకొల్లు నియోజకవర్గ కన్వీనర్ యర్రంశెట్టి పద్మారావు, కో-కన్వీనర్ దొంగ నరసింహకుమార్ పాలకొల్లు పట్టణ అధ్యక్షులు కొల్లికొండ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రైల్వే బైపాస్ రోడ్డుతో తీరిన వెతలు

నరసాపురం: పట్టణంలోని రైల్వేస్టేషన్‌ను ఆనుకుని చినమామిడిపల్లిలో నిర్మించిన బైపాస్ రోడ్డు కీలకంగా మారడమే కాకుండా సుమారు 40 గ్రామాల వారికి ఉపయోగంగా మారింది. చినమామిడిపల్లిలో రైల్వేగేట్ సమస్య ఏడాదిన్నర క్రితం వరకూ వేదించేది. పలురైళ్ల రద్దీ కారణంగా పగటిపూట కూడా సుమారు 3 గంటలపాటు గేటు మూసేసేవారు. ఇంజిన్‌లు షంటింగ్ కారణంగా ఈ పరిస్థితి ఉండేది. అయితే రైల్వేశాఖ స్టేషన్‌ను ఆనుకుని ఉన్న స్థలంలో బైపాస్‌రోడ్డు నిర్మించి, గేట్‌ను శాశ్వతంగా మూసేశారు. దీంతో రైల్వేగేట్ సమస్యకు మోక్షం కలిగింది. దీంతో మత్స్యపురి మీదుగా నరసాపురం నుంచి భీమవరం వెళ్లే ట్రాఫిక్ ఈ రోడ్డులో విపరీతంగా పెరిగింది. రైల్వేగేట్ సమస్య లేకపోవడంతో సుమారు 40 గ్రామాల వారు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇటుగా ప్రయాణిస్తున్నారు. దశాబ్దాల నాటి రైల్వేగేట్ సమస్య తీరడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.


చినమామిడిపల్లి వద్ద నిర్మించిన బైపాస్‌రోడ్డు

పట్టణ సుందరీకరణలో మునిసిపాలిటీ నిర్లక్ష్యం


పట్టణంలో లాకుల వద్ద మట్టి దిబ్బలతో అధ్వానంగా ఉన్న గోదావరి గట్టు రోడ్డు


రైల్వేస్టేషన్ రోడ్డులో సెంట్రల్ డివైడర్ల మధ్య మొక్కలు పాడైపోయిన దృశ్యం

నరసాపురం: పట్టణ సుందరీకరణ విషయంలో మున్సిపల్ అధికారులు తీవ్ర నిర్లక్ష్యాన్ని ప్రదర్శిస్తున్నారు. ఫలితంగా వనరులన్నీ అందుబాటులో ఉండి కూడా పట్టణ పరిస్థితి దారుణంగా తయారైంది. ఎక్కడ పడితే అక్కడ రోడ్డు పక్కన పిచ్చిమొక్కలు, మట్టి దిబ్బలు దర్శనమిస్తున్నాయి. ముఖ్యంగా లాకులు నుంచి కొండాలమ్మ గుడి వరకూ గోదావరి గట్టు వెంబడీ. అలాగే మత్స్యపురి వంతెన నుంచి సబ్‌కలెక్టర్ కార్యాలయం వరకూ పంట కాలువ వెంబడి గతంలో ప్లాట్‌పామ్ నిర్మించి రెయిలింగ్ ఏర్పాటు చేశారు. కొండాలమ్మగుడి ప్రాంతంలో మార్బుల్స్ రెయిలింగ్ ఏర్పాటు చేశారు. అధికారులు పట్టించుకోకపోవడం, నిర్వహణ లోపంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ముఖ్యంగా గోదావరి బండ్‌కు వెళ్ళే మార్గంలో నిర్మించిన రోడ్లు ఉపయోగం లేకుండా పోయాయి. రైల్వేస్టేషన్‌రోడ్డులో సెంట్రల్ డివైడర్ల పాతిన మొక్కలు లేకుండా పాడైపోయాయి. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు వీటి పరిస్థితిపై దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

జేసీఐ ఆధ్వర్యంలో రక్తదానం

పాలకొల్లు సెంట్రల్: రక్తదానం చేస్తే ఒకరికి ప్రాణదానం చేసినట్లేనని జేసీఐ మండల శాఖ కార్యదర్శి కొమ్ముల మురళీకృష్ణ అన్నారు. శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా జేసీఐ పాలకొల్లు రైసింగ్ ఆధ్వర్యంలో ఆపద్బంధు బ్లడ్ బ్యాంక్‌లో రక్తదానం చేశారు. ఈ సందర్భంగా మురళీకృష్ణ మాట్లాడుతూ ఇప్పటికి 60 సార్లు రక్తదానం చేశానని తెలిపారు. నేటి సమాజంలో రక్తదానం చేయడం వల్ల నీరసం వస్తుందనే అపోహలు ఇంకా చాలామందిలో ఉందన్నారు. రక్తదానం చేయడం అంటే ఆరోగ్యమే తప్ప అనారోగ్య సమస్య ఉండదని అన్నారు. రక్తదానం చేసిన వారి శరీరంలో నూతనంగా రక్తం ఏర్పడుతుందన్నారు. కార్యక్రమంలో జేసీఐ సభ్యులు రాజేష్, యశ్వంత్ తదితరులు పాల్గొన్నారు.



రక్తదానం చేస్తున్న జేసీఐ సభ్యులు

దళితులను అవమానించిన వారిని కఠినంగా శిక్షించాలి


నన్నేటి పుష్పరాజ్

పెనుగొండ: మంగళగిరిలో దళితులు రోడ్డుపై నడిచారని అగ్ర కుల దురహంకారంతో పసుపు నీళ్లతో శుద్ధి చేసిన మహిళను కఠినంగా శిక్షించాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు నన్నేటి పుష్పరాజ్ డిమాండ్ చేశారు. శనివారం ఆచంట వేమవరంలో విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రంలో దళితులను మనుషులుగా గుర్తిస్తున్నారా? అనే అనుమానం కలుగుతుందన్నారు. మంగళగిరి ఘటనను ఎస్సీ కమిషన్ తీవ్రంగా తీసుకోవాలని, డీఎస్పీ పర్యవేక్షణలో అవమానం పొందిన కుటుంబానికి న్యాయం జరిగేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

కాలువలకు నీళ్లొచ్చాయి

పెనుగొండ: కాలువలకు కొత్త నీటిని వదిలారు. వేసవి ఏప్రిల్‌లో కాలువలకు నీటిని వదలడం నిలిపివేశారు. మృగశిర కార్తె ప్రారంభం కావడంతో రైతులు సాగుకు సన్నద్ధం అవుతున్నారు. దీంతో కాలువలకు నీటిని వదిలారు. డెల్టాలో అతి పెద్ద కాలువైన నరసాపురం కాలువకు నీరు వదలడంతో నరసాపురం వైపు కొత్త నీరు ప్రవహిస్తుంది. కాలువ నిండిన అనంతరం పంట కాలువల్లోకి అధికారులు నీటిని వదులుతారు. కాలువలకు నీరు రావడంతో కాలువ పరివాహక ప్రాంతాల్లో మహిళలు కాలువలో పసుపు, కుంకుమలు వదలి పూజలు నిర్వహిస్తున్నారు.


నరసాపురం ప్రధాన కాలువల్లోకి చేరుకున్న నీరు

వెంకన్నకు మామిడిపండ్ల అలంకరణ

నరసాపురం రూరల్: మండలంలోని మేములదీవి గ్రామం కాపులకొడపలో ఉన్న వేంకటేశ్వరస్వామిని శనివారం మామిడిపండ్లతో ఆలయ అర్చకుడు పెద్దింటి అరుణ్ కుమార్ ఆచార్యులు ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. భక్తులు స్వామి వారిని దర్శించుకుని, మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ నిర్వాహకులు ఆలయ ఆవరణలో అన్నసమారాధన నిర్వహించారు.


ప్రత్యేకాలంకరణలో వేములదీవి వెంకన్న

అంగన్‌వాడీలో ఆటపాటలతో కూడిన విద్య

పాలకోడేరు: అంగన్‌వాడీల్లో ఆట పాటలతో కూడిన విద్య అందించడం జరుగుతుందని, మూడేళ్లు నిండిన ప్రతి చిన్నారిని అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పార్వతి అన్నారు. మండలంలోని గొల్లలకోడేరులో శనివారం అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సూపర్‌వైజర్ అంగన్‌వాడీలో చిన్నారులకు అందించే విద్య, సౌకర్యాలు గురించి తల్లులకు అవగాహన కల్పించారు. అనంతరం పిల్లలకు అక్షర అభ్యాసం నిర్వహించి, తల్లులు, అంగన్‌వాడీ టీచర్లతో కలిసి ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో విజయలక్ష్మి, సోనీ, జెమీమా, భాగ్యలక్ష్మి, నాగలక్ష్మి, పాల్గొన్నారు.

అంగన్వాడీల ద్వారా చిన్నారులకు పరిజ్ఞానం.

ఉండి: అంగన్‌వాడీ కేంద్రాల్లో నిర్వహించే ప్రీ స్కూల్ ద్వారా చిన్నారులకు చదువుపై మంచి పరిజ్ఞానం లభిస్తుందని ఐసీడీఎస్ యండగండి సెక్టార్ సూపర్‌వైజర్ వి.నిర్మల అన్నారు. శనివారం ఎన్నార్పీ అగ్రహారంలో నిర్వహించిన అంగన్‌వాడీ పిలుస్తోంది కార్యక్రమంలో ఆమె ప్రీ స్కూల్ నమోదు చేపట్టారు.

రక్తదాతలకు సత్కారం

భీమవరం: రక్తదానం పట్ల అపోహలు విడనాడి ఆరోగ్యవంతులైన ప్రతి ఒక్కరూ రక్తదానం చేయాలని ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. శనివారం ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని శ్రీవిజ్ఞానవేదిక ఆధ్వర్యంలో ఎక్కువ పర్యాయాలు రక్తదానం చేసిన బోడపాటి పెదబాబు, కొప్పినీడి బాబీ, కేవీఎల్ నర్సింహరావు, చల్లా రాము, చీడే చందులను ఎమ్మెల్యే సత్కరించారు.

రైతులకు చేరని ధాన్యం సొమ్ము

- బ్యాంకుల చుట్టూ తిరుగుతున్న అన్నదాతలు
- పట్టించుకోని అధికారులు

నరసాపురం రూరల్: ధాన్యం అమ్మిన రైతులకు కూటమి సర్కార్ చుక్కలు చూపిస్తోంది. ధాన్యం కొనుగోలు చేసి వారాలు, నెలలు గడుస్తున్నా.. ఇప్పటికీ డబ్బులు బ్యాంకు ఖాతాలకు జమ చేయలేదు. రైతు సేవా కేంద్రాల వద్దకు వెళ్లి అధికారులను అడిగితే ధాన్యం డబ్బులను ప్రభుత్వమే నేరుగా బ్యాంకు ఖాతాలకు జమ చేస్తుందని చెబుతున్నారు. దీంతో ధాన్యం అమ్మిన రైతులు రోజూ బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నప్పటికీ డబ్బులు మాత్రం పడటం లేదని రైతులు వాపోతున్నారు. ధాన్యం విక్రయించిన వెంటనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అవుతాయన్న ప్రభుత్వం తన హామీని నిలుపుకోవడం లేదని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. పంట పెట్టుబడులు కోసం తీసుకున్న రుణాలకు వడ్డీలు పెరిగిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

35 రోజులైనా

నరసాపురం మండలంలో మే నెల 10వ తేదీ నుంచి నేటి వరకూ సుమారు 35 రోజులు కావస్తున్నా ఇంత వరకూ రైతుల ఒక్క రూపాయి కూడా జమ చేసిన పాపాన పోలేదు. కేవలం మండలంలోనే 9 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సేకరించగా దీనికి సంబంధించి రూ.21 కోట్ల వరకూ చెల్లించాలి. కానీ ఇప్పటి వరకూ రైతుల బ్యాంకు ఖాతాలకు ఈ 35 రోజుల్లో ఒక్క రూపాయి కూడా జమ చేయలేదు. ఇదిలా ఉంటే ధాన్యం కోతలు ముమ్మరంగా జరుగుతున్న సమయంలో కురిసిన అకాల వర్షాలకు తడిచిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తామని చెప్పిన కూటమి నేతలు ముఖం చాటేయడంతో చాలా మంది ప్రైవేటు వ్యాపారులకే అయిన కాడికి విక్రయించుకున్నారు. ధాన్యం రంగు మారింది. తడిచింది అనే వివిధ కారణాలతో ధాన్యం కొనుగోలు చేయక పోవడంతో ఇంకా ఇంటి పట్టున, కళ్లాల్లోనూ ఒబ్బిడి చేసిన ధాన్యం రాశులతో ఎదురుచూస్తున రైతులు కూడా మల్లవరం లంక గ్రామంలో దర్శనమిస్తున్నారు.


మల్లవరంలంక గ్రామంలో రైతు ఇంటి వద్ద ఆరబెట్టిన ధాన్యం

నాలుగు వారాలైనా జమ కాలేదు



నేను మే నెల 10న నాలుగు ఎకరాల ధాన్యాన్ని ప్రభుత్వానికి విక్రయించాను. దీనికి సంబంధించిన డబ్బులు వస్తాయని ఎదురుచూస్తున్నాను. వారం రోజుల్లో బ్యాంకు ఖాతాలో పడతాయని అధికారులు చెప్పారు. నాలుగు వారాలు గడిచినా డబ్బులు జమ కాలేదు.

– బాలం మల్లేశ్వరరావు, పరసావారి మెరక

కొనడానికి ఇబ్బందులు



నాకున్న రెండకరాలకు మరో నాలుగెకరాలు కౌలుకు సాగు చేస్తున్నాను. వరి కోతకోసిన సమయంలో వర్షం రావడంతో ధాన్యం తడిచింది. ప్రభుత్వం తడిచిన ధాన్యాన్ని సైతం కొనుగోలు చేస్తామని చెప్పినా ఆర్ఎస్‌కే అధికారుల వద్దకు ఎన్ని సార్లు తిరిగినా ప్రయోజనం లేదు. దళారుల వద్దకు వెళితే చాలా తక్కువకు అడుగుతున్నారు. వెంటనే ధాన్యాన్ని కొనుగోలు చేసి ఆదుకోవాలి.

– కప్పురు రామాంజనేయులు, మల్లవరంలంక